సాక్షి ఒడిశా

మంగళవారం । 7 । జనవరి । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 5,66,432

బంగారం : 10 గ్రాముల 100 మిల్లీ గ్రాములు

వెండి : 67 గ్రాముల 100 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



విద్యార్థికి గాయాలు

మల్కన్‌గిరి సమితిలో రోడ్డు ప్రమాదం జరిగింది. విద్యార్థి గాయపడ్డాడు.

- 8లో▸

నబరంగ్‌పూర్ జిల్లా జనాభా 13,32,985

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా జనాభా 13,32,985 మంది అని కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో ప్రకటించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ వివరాలు ప్రకటించారు. అందులో 8,65,567 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వారిలో 4,26,875 మంది పురుష ఓటర్లు, 4,38,687 మంది స్త్రీ ఓటర్లు, 65 మంది కిన్నెరలు ఉన్నారని ప్రకటించారు. 16,391 నూతన ఓటర్లు నమోదైనట్లు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

కళాశాల మైదానంలో సౌకర్యాలు కల్పించాలి



ఎంపీ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహికి వినతిని అందజేస్తున్న దారపు రాజేష్

పర్లాకిమిడి: స్థానిక శ్రీక్రిష్ణచంద్ర గజపతి (స్వయం ప్రతిపత్తి) కళాశాల మైదానంలో విశ్రాంత షెడ్డు, తాగునీటి సౌకర్యం, శౌచాలయం, లైటింగ్ సౌకర్యం కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షులు, జిల్లా పరిషత్ ఎంపీ ప్రతినిధి దారపు రాజేష్ కుమార్ కోరారు. ఈ మేరకు బరంపురం ఎంపీ డాక్టర్ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహికి ఆదివారం వినతి పత్రం అందజేశారు. తొలుత ఎస్.కె.సి.జి. కళాశాల ప్రిన్సిపాల్‌కు వాకర్స్ క్లబ్ ప్రతినిధులు, ఇతరులు కలిసి ఉదయం, సాయంత్రం వ్యాయామానికి వెళ్తున్న వారికి కనీస సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

దివ్యాంగులకు బ్యాటరీ ఆటో రిక్షాలు అందజేత



బ్యాటరీ ఆటోలను అందజేస్తున్న కలెక్టర్ శుభంకర్ మహాపాత్రో

కొరాపుట్: దివ్యాంగులకు 13 బ్యాటరీ ఆటో రిక్షాలను ఉచితంగా అధికారులు అందజేశారు. నబరంగ్‌పూర్ మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార శిబిరంలో నబరంగ్‌పూర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో వీటిని పంపిణీ చేశారు. కాగా గ్రీవెన్స్‌లో 42 వినతులు అందినట్టు అధికారులు చెప్పారు. వీటిలో 37 వ్యక్తిగత, ఐదు సామూహిక వినతులు ఉన్నాయి. వీటి పరిష్కారం కోసం కలెక్టర్ అధికారులకు ఆదేశాలు పంపించారు. కార్యక్రమంలో ఏడీఎం మహేష్ చంద్ర నాయక్ పాల్గొన్నారు.

అమ్మో.. బర్డ్ ఫ్లూ



పూరీ జిల్లా ప్రాంతం ఫారమ్‌లో చనిపోయిన కోళ్ల గుట్టలు

భువనేశ్వర్: రాష్ట్రంలో మరోసారి బర్డ్ ఫ్లూ భయం బెంబేలెత్తిస్తోంది. అక్కడక్కడ కొన్ని చోట్ల ఈ సంకేతాలు బలంగా తారసపడుతున్నాయి. పలు చోట్ల కాకులు ఇతరేతర పక్షులు మృతి చెంది నేలకు ఒరుగుతున్నాయి. పూరీ జిల్లా కృష్ణప్రసాద్ మండలంలో బర్డ్ ఫ్లూ భయంతో భయాందోళనలకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో వివిధ కోళ్ల ఫారాల్లో పెద్ద సంఖ్యలో కోళ్లు చనిపోతున్నాయి. మరికొన్ని చోట్ల కాకులు చనిపోతున్న సంఘటనలు బర్డ్ ఫ్లూ సంకేతాల్ని బలపరుస్తున్నాయి.

ఒడిశాలో హెచ్‌ఎంపీ వైరస్ జాడ లేదు: ప్రజారోగ్య శాఖ

భువనేశ్వర్: దేశంలో తాజాగా హెచ్‌ఎంపీ వైరస్ వ్యాప్తి తీవ్ర ఆందోళన కలిగిస్తుంది. అయితే ఈ వైరస్ ఛాయలు జాడలు రాష్ట్రంలో ఇంత వరకు తారస పడలేదని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ సోమవారం స్పష్టం చేసింది. హెచ్‌ఎంపీ వైరస్ నిర్వహణ పట్ల మేము పూర్తిగా సిద్ధంగా ఉన్నామని, కేంద్రం నుంచి మార్గదర్శకాల కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఇంత వరకు హెచ్‌ఎంపీ వైరస్ జాడలు తారస పడలేదు. దగ్గు, జలుబు వంటి లక్షణాలను కలిగిన వారి నుంచి దూరం పాటించడం శ్రేయోదాయకమని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ నీలకంఠ మిశ్రా తెలిపారు.

రైల్వే డివిజన్ ఏర్పాటుకు శ్రీకారం

- డివిజన్ కార్యాలయ భవన నిర్మాణం ప్రారంభం
- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ
- 2036 నాటికి రాష్ట్ర రూపురేఖలు మారిపోతాయి: సీఎం మోహన్ చరణ్



ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న రైల్వే ఉన్నతాధికారులు



ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర రైల్వే సహాయమంత్రి రణవీత్ సింగ్ బిట్టు



రాయగడ మండల రైల్వే కార్యాలయం రూపురేఖలు



ప్రారంభోత్సవ కార్యక్రమంలో వేదిక వద్ద కళాకారుల ఒడిశీ నృత్యం

రాయగడ: రాయగడలో తూర్పు కోస్తా రైల్వే డివిజన్ ఏర్పాటుకు సన్నద్ధత మొదలైంది. ప్రధాని మోదీ సోమవారం డివిజన్ కార్యాలయ భవన నిర్మాణానికి వర్చువల్ మాధ్యమంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ రాష్ట్రంలో అపార ఖనిజ సంపదలు ఉన్నాయని, వాటిని సక్రమంగా సద్వినియోగపరిచి కొత్త పరిశ్రమలకు ఆహ్వానం పలుకుతామని అన్నారు. దీంతో రాష్ట్ర ఆర్థిక స్థితి గతులు మెరుగు పడతాయని ఆకాంక్షించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని అన్నారు. ఎన్నాళ్లుగానో ఈ ప్రాంత వాసులు ఎదురుచూస్తున్న రైల్వే డివిజన్ ఏర్పాటు కావడం జగన్నాథుని ఆశీర్వాద బలమేనని అన్నారు. ఈ రైల్వే డివిజన్‌తో ఒడిశా రాష్ట్రం రవాణా రంగంలో మరోమైలు రాయి చేరుకుంటుందని అన్నారు. ఖనిజ సంపదలకు నిలయమైన రాయగడ జిల్లా భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రైల్వే డివిజన్ ఏర్పాటులో భాగంగా సుమారు రూ.107 కోట్ల వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలు గల డివిజన్ ప్రధాన కార్యాలయ భవనాన్ని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని వివరించారు. అదే విధంగా డివిజన్ నిర్మాణంలో భాగంగా సుమారు 20 వేల కోట్ల రూపాయలతో డివిజన్‌కు సంబంధించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల పనులు త్వరిత గతిన ప్రారంభం కానున్నాయని అన్నారు.

ఒడిశాపై కేంద్రం ప్రత్యేక దృష్టి

అపార ఖనిజ సంపదలు గల ఒడిశా రాష్ట్రాన్ని పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చేయడంతో పాటు రైల్వే రంగంలో కొత్త ఒరవడులను సృష్టించడానికి కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించిందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అన్నారు. రైల్వే డివిజన్ ఏర్పాటులో భాగంగా స్థానిక రైల్వే మైదానంలో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో గల డబుల్ ఇంజన్ సర్కార్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తుందని అన్నారు. ముఖ్యంగా ఖనిజ సంపదలు గల ఈ రాష్ట్రం పారిశ్రామిక హబ్ గా గుర్తింపు పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా అహర్నిశలు బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. బాక్సైట్ నిక్షేపాలు గల రాయగడ జిల్లాలో ఉత్కళ అలూమిన, ఇండియన్ మెటల్స్ అండ్ ఫెర్నో ఎల్లాయిస్, జేకేపేపర్ మిల్ వంటి బృహత్తర పరిశ్రమలు ఇప్పటికే ఉన్నాయని, రానున్న రోజుల్లో మరిన్ని బృహత్తర పరిశ్రమలు ఈ జిల్లాలో ఏర్పాటు కానున్నాయని అన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా బీజేపీ ప్రభుత్వం సుమారు రూ.1.50 వేల కోట్లతో బృహత్తర ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ముఖ్యమంత్రి మాఝి ఈ సందర్భంగా తెలియజేశారు. గత పదేళ్లలో రాష్ట్రం రైల్వే రంగంలో చెప్పుకోదగ్గ అభివృద్ధిని సాధించిందని అన్నారు.

రాయగడలో మెడికల్ కళాశాల

అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు నడుస్తున్న రాయగడలో త్వరలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం యోచిస్తోందని ముఖ్యమంత్రి మాఝి వివరించారు. త్వరలో ఈ జిల్లా ప్రజలు తీపి కబురు విననున్నారని అన్నారు. వైద్య రంగంలో మరిన్ని సౌకర్యాలను ప్రజలకు అందేలా చూస్తామని అన్నారు. ఆధునిక సౌకర్యాలతో ఈ జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటు తథ్యమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నిత్యానంద గొండ, కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రణవీత్ సింగ్ బిట్టు, నవరంగపూర్ ఎంపీ భలభద్ర మాఝి, కలహండి ఎంపి మాల్విక దేవి, బరంపురం ఎంపీ డాక్టర్ ప్రదీప్ కుమార్ మాఝి, కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక, రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక, తూర్పుకోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ పంక్వాల్, డిఆర్ఎం విశాఖపట్నం మనోజ్ కుమార్ సాహు తదితర ప్రముఖులు, రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ధరల బాదుడుపై విపక్షం మండిపాటు



ధరల పెరుగుదల వ్యతిరేక ఆందోళన సభలో నవీన్ పట్నాయక్ ప్రసంగం



బీజేడీ ఆందోళనతో జన సంద్రంగా మారిన దిగువ పీఎంజీ కూడలి

భువనేశ్వర్: అబద్ధపు మాటలు, అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన మోహన్ చరణ్ మాఝి సర్కారు ధరల బాదుడు సర్కారుగా మారిందని విపక్ష నేత నవీన్ పట్నాయక్ మండిపడ్డారు. పప్పు, నూనె, కూరగాయలు, మందులు సకల నిత్యావసర సరుకుల ధరలు చుక్కల్ని తాకాయని, పంట నష్టపోయిన రైతులను ఎవరూ పట్టించుకోవడం లేదని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా విపక్ష బిజూ జనతా దళ్ ఆందోళనకు ఆయన శంఖారావం చేశారు. సోమవారం జరిగిన ఈ ఆందోళనతో స్థానిక దిగువ పీఎంజీ కూడలి బీజేడీ కార్యకర్తలతో కిక్కిరిసిపోయింది. సామాన్య పౌరుని దైనందిన జీవనం నానాటికి దుర్భరమవుతోందని, నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలను అరికట్టడంలో సర్కారు చర్యలు శూన్యంగా పరిణమించాయని విమర్శించారు. ఆందోళన ప్రాంగణం నుంచి విపక్ష నేత నవీన్ పట్నాయక్ రాష్ట్రంలో మోహన్ చరణ్ మాఝి సర్కారుకు సవాళ్లు విసిరారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమానికి బిజూ జనతా దళ్ కట్టుబడి ఉందని, ధరల పెరుగుదల వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజా పక్షాన నిలిచేందుకు ధరల నియంత్రణ పిలుపుతో ఆందోళనకు నడుం బిగించిందన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలి వచ్చిన కార్యకర్తలు కొత్త ప్రభుత్వం పాలన తీరుని ప్రజల అవగాహనకు అనుకూలంగా వివరించాలని పిలుపునిచ్చారు. అశేష సంఖ్యలో తరలి వచ్చిన కార్యకర్తలతో పీఎంజీ కూడలి జన సంద్రంగా మారింది. ధరలు తగ్గించడంలో ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా పలువురు కార్యకర్తలు బంగాళా దుంపలు వంటి కూరగాయల మాలలు మెడలో హారంగా ధరించారు. మరి కొందరు వంట గ్యాస్‌బండలు నెత్తిన పెట్టుకుని ధరల బాదుడు సర్కారుగా నినాదాలు చేసి పరిసరాలు మార్మోగించారు. 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత బీజేడీ పిలుపునిచ్చిన తొలి ర్యాలీకి విశేష స్పందన లభించింది.

ఈ ఆందోళనలో బీజేడీ ఎమ్మెల్యేలు తదితర సంస్థాగత ప్రముఖులు, సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం బీజేడీ శిబిరంలో సమైక్యతకు అద్దం పట్టిందని ఆందోళనకారులు ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల పరిరక్షణ కోసం నవీన పట్నాయక్ నేతృత్వంలో బిజూ జనతా దళ్ ఎల్ల వేళల్లో ముందంజలో ఉంటుందని హామీ ఇచ్చారు.



బీజేడీ పతాకాలతో పలు ప్రాంతాల నుంచి ఆందోళన బాటలో కార్యకర్తలు



ధరల పెరుగుదలకు నిరసనగా కూరగాయల హారాలతో ఆందోళనకు దిగిన బీజేడీ వర్గీయులు

'వేరే దారిలో జీతాలు సరికాదు'



సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘ ప్రతినిధులు

జయపురం: సేవా పేపరు మిల్లు కార్మికులకు వేరే కంపెనీ నుంచి జీతాలు జమ చేయటం సరికాదని పేపరుమిల్లు కార్మిక యూనియన్ అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ మహంతి అన్నారు. సోమవారం స్థానిక యాధవ భవనంలో సేవా కార్మిక సంఘం, విశ్రాంతి కార్మిక సంఘ ప్రతినిధులు పేపరుమిల్లు ప్రస్తుత పరిస్థితిపై సమీక్షించారు. బసంత బెహర అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రమోద మహంతి మాట్లాడుతూ 7 నెలల తర్వాత కార్మికులకు 2024 జూన్ నెల జీతం ఏఈజీ ఇన్‌ఫ్రాఅనే కంపెనీ నుంచి రావడం సబబుగా లేదన్నారు. ఇది అనైతికమని తెలిపారు. గత మార్చి నెల నుంచి కార్మికులకు పీఎఫ్ జమ కావడం లేదని తెలిపారు. దీనిపై ఈ నెల 4న లేబర్ కమీషనర్ కు మెమోరాండం సమర్పించామని వెల్లడించారు. కార్మికుల పీఎఫ్ లూటీ అయ్యిందని ఆరోపించారు. ఈ విషయం గత జూన్ నెలలో జయపురం సబ్ కలెక్టర్‌కు, లేబర్ కమిషనర్, మిల్లు యాజమాన్యానికి ఆదేశించారని తెలియజేశారు. ఈ విషయంలో ఒక ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేసినట్లు మహంతి వెల్లడించారు. ఈ విషయాలన్ని పీఎఫ్ కమిషనర్‌కు వివరించేందుకు ఈ నెల 16వ తేదీన బరంపురం ఈపీఎఫ్ కమిషనర్ కార్యాలయం ముంగిట ధర్నా, ఆందోళన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో కార్మిక నేతలు అలేఖ్ పాత్రో, ప్రహ్లాద్ మల్లిక్, భాస్కర మిశ్ర, కేదార్ బెహర తదితరులు పాల్గొన్నారు.

శ్రీ జగన్నాథునికి రజత శంఖం విరాళం

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథ స్వామికి భక్తుడు రజత శంఖం విరాళంగా సమర్పించాడు. పశ్చిమ ఒడిశా సంబల్‌పూర్‌కు చెందిన నళినీ ప్రభా దాస్ అనే భక్తుడు 1 కేజీ 619 గ్రాముల బరువున్న సుమారు రెండున్నర లక్షల రూపాయల విలువైన శంఖాన్ని విరాళంగా అందజేశాడు. దైతపతి సేవాయత్ ఆధ్వర్యంలో శ్రీ మందిరం సేవా విభాగం అధికారికి ఈ శంఖం సోమవారం సమర్పించారు. ప్రత్యేక పండగలు, ఉత్సవాదుల్లో తాను సమర్పించిన రజత శంఖం కూడ స్వామి అలంకరణలో చోటు చేసుకోవడం తన భాగ్యమని మురిసిపోయాడు.



శ్రీ జగన్నాథునికి భక్తుడు సమర్పించిన రజత శంఖం

ఆధ్యాత్మిక పాఠాల బోధన



విద్యార్థులకు బోధిస్తున్న ఆధ్యాత్మిక గురువులు

జయపురం:

జయపురం మున్సిపాలిటీ జయనగర్‌లో గల డివైన్ లైఫ్ సొసైటీ కార్యాలయంలో సోషల్ ఎడ్యుకేషనల్ ఎన్విరాన్‌మెంటల్ వెల్ఫేర్ అసోసియేషన్ సోమవారం ఆధ్యాత్మిక పాఠశాల నిర్వహించింది. విద్యార్థులకు ఆధ్యాత్మిక విషయాలు బోధించారు. అనంతరం రామాయణ, మహాభారతాలపై క్విజ్ నిర్వహించారు. పోటీల్లో విజేతలకు సీవా బహుమతులు అందజేశారు.

గ్రీవెన్స్‌లో వినతుల స్వీకరణ



పర్లాకిమిడి: వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ బిజయ కుమార్‌దాస్



పర్లాకిమిడి: గ్రీవెన్స్‌కు హాజరైన ప్రజలు



జయపురం: హాజరైన ప్రజలు, వివిధ విభాగాల సిబ్బంది

పర్లాకిమిడి: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జాయింట్ గ్రీవెన్ సెల్, స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ బిజయ కుమార్ దాస్ వినతులు స్వీకరించారు. గ్రీవెన్స్‌కు కెరండి, కత్తల కవిటి, సిద్ధమణుగు, రాణిపేట, పర్లాకిమిడి పురపాలక పరిధిలోని ప్రజలు హాజరై వినతులు అందించారు. ఈ వారం మొత్తం 57 వినతులు అందాయి. వీటిలో 47 వినతులను పరిశీలించి అక్కడికక్కడే కలెక్టర్ పరిష్కరించారు. స్పందన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ పండా, డీఆర్‌డీఏ ముఖ్యకార్యనిర్వాహణాధికారి గుణనిధి నాయక్, సబ్ కలెక్టర్ అనుప్ పండా, తహసీల్దార్ నారాయణ బెహారా, గుసాని సమితి బీడీవో గౌరచంద్ర పట్నాయక్ పాల్గొన్నారు.

జయపురంలో..

జయపురం: జయపురం సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. వచ్చిన వాటిలో 27 వినతులను అధికారులు అక్కడికక్కడే పరిష్కరించారు.. వాటిలో 19 వ్యక్తిగత, ఎనిమిది కమ్యూనిటీ వినతులు ఉన్నాయి. కొంతమంది ఆర్థిక సహాయం కోసం కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసుకున్నారు. బొరిగుమ్మ ప్రజలు చిట్‌ఫండ్ సంస్థపై ఫిర్యాదు చేశారు. జయపురంలో క్రికెట్ మైదానం సమకూర్చాలని సమాజ సేవకులు వినతి అందించారు. జయపురంలో డ్రైవింగ్ శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పాలని పాత్రికేయులు నరసింగ చౌదురి కోరారు. కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తివాసన్ అధ్యక్షతన జరిగిన స్పందనలో జయపురం సబ్ కలెక్టర్ లక్ష్ర్ కుమారి అక్కవరం శౌశ్యా రెడ్డి, కొరాపుట్ జిల్లా ఎస్పీ రోహిత్ వర్మ, జిల్లా కేంద్ర ఆస్పత్రి అధికారి డాక్టర్ రబి నారాయణ మిశ్ర, జయపురం బీడీవో, ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డవలప్‌మెంట్ ఇన్‌చార్జి ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ శక్తి మహాపాత్రో, జయపురం తహసీల్దార్ సవ్యసాచి జెన, జయపురం మున్సిపాలిటీ అదనపు కార్యనిర్వాహక అధికారి కృతివాస సాహు, జిల్లా పంచాయతీ అధికారి జుగల కిశోర్ నాయక్ , జిల్లా అర్బన్ డవలప్‌మెంట్ ఏజెన్సీ ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ దేవీ ప్రసాద్ డాలి, కొరాపుట్ సీఎస్‌వో సర్వేశ్వర నాయక్, డీసీపీవో రాజేశ్వరీ దేవి, ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శిరొధర ఖండపాణి, జయపురం బ్లాక్ ఎడ్యుకేషన్ విభాగ అధికారి చందన నాయిక్ ఉన్నారు.



జయపురం: స్పందనలో కలెక్టర్, సబ్‌కలెక్టర్, ఎస్పీ, వైద్యాధికారులు

మల్కన్‌గిరిలో..

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్‌సెలన్‌ను సోమవారం నిర్వహించారు. ఈ వారం 28 వినతులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. వీటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధన్, మల్కన్‌గిరి సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి పాల్గొన్నారు.



మల్కన్‌గిరి: మహిళల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్



మల్కన్‌గిరి: కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న దంపతులు

క్లుప్తంగా

చేతబడి కలకలం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల పోలీసుస్టేషన్ పరిధిలో గల చిత్తపరి గ్రామంలో చేతబడి ఆరోపణలు కలకలం రేపాయి. బలిమెల ఐఐసి దీరాజ్ పట్నాయిక్ తెలిపిన వివరాల మేరకు.. చిత్తపరి గ్రామంలో కొన్ని రోజులుగా జంతువులు చనిపోతున్నాయి. గ్రామంలో ఆదివారం వరకు జాతర జరిగింది. ఈ సమయంలో అర్ధరాత్రి పూజలు చేస్తూ కొందరు పట్టుబడ్డారు. గ్రామానికి చెందిన బతిఖీలో (67) అనే వృద్ధురాలు చేతబడి చేస్తోందంటూ ఆమెను గ్రామస్తులు మందలించి గ్రామం నుంచి వెలివేశారు. పోలీసులు విషయాన్ని తెలుసుకుని ఆమెను విచారించి మరో ఆరుగురి గురించి తెలుసుకుని సోమవారం ఉదయం టికేంద్ర నేహరీ, ఖిరేంద్ర నాగ్, రాము మాండ్వీ, జగన్నాద్ నాగ్, కముల రామ్, మంగుళురామ్, బాగేల్‌లను అరెస్టు చేశారు. వీరు చత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్‌కు చెందిన వారు.

ట్రాఫిక్ సమస్యపై దృష్టి



వ్యాపార సంస్థల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎస్‌డీపీఓ

రాయగడ: జిల్లాలోని మునిగుడలో పెరుగుతున్న ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలకు సంబంధించి ఎస్‌డీపీఓ సంతోషిణి ఒరం మర్చెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సామవారం సమావేశమయ్యారు. జనాభాపరంగా పెరుగుతున్న మునిగుడలో సమస్యల నివారణకు అందరూ సహకరించాలన్నారు. మెర్చంట్స్ అసోసియేషన్ కార్యదర్శి బలరాం నాయక్, సభ్యులు ప్రభాత్ పాణిగ్రహి, ప్రదీప్ పొరిచ్చి, చిత్తరంజన్ దాస్, పురుషోత్తం చౌదరి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మునిగుడలో గల ప్రభుత్వ ఆస్పత్రి నుంచి గొవర్దన్ కూడలి ప్రధాన రహదారి మధ్యలో వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య పెరుగుతోందని ఎస్‌డీపీఓ అన్నారు.

12న క్విజ్ పోటీలు

కంచిలి: పెద్దకొజ్జిరియా గ్రామంలో ఈనెల 12వ తేదీన స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు స్థానిక స్వామి వివేకానంద యువజన సంఘం సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజున స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ పోటీలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ప్రతీ టీమ్‌లో నలుగురు సభ్యులు ఉండాలని, ప్రవేశ రుసుం లేదని, భోజన సదుపాయం కలిస్తామని, తుది నిర్ణయం న్యాయనిర్ణేతలదేనని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు 50 మార్కులతో స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందని, అందులో ఎంపికైన టాప్ 10 టీమ్స్ మెయిన్స్ రౌండ్‌లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి ఉన్న టీంలు 90109 02091, 98665 81937, 90103 03454 నంబర్లను సంప్రదించాల్సిందిగా సూచించారు.

వివేకానందుడు ఆదర్శప్రాయుడు



మాట్లాడుతున్న దేవేంద్రకుమార్ బాహిణీపతి

జయపురం: వివేకానందుడు ఆదర్శప్రాయుడని కొరాపుట్ జిల్లా మానవ హక్కుల సమితి జయపురం అధ్యక్షుడు దేవేంద్ర కుమార్ బాహిణీపతి అన్నారు. ఈ నెల 12న వివేకానంద జయంతి, యువజన దినోత్సవాల సందర్భంగా కొరాపుట్ జిల్లా మానవ హక్కుల సమితి జయపురం వారు సోమవారం స్థానిక విక్రమదేవ్ విశ్వద్యాలయంలో పోటీలను నిర్వహించారు. వివేకానందుడు వివిధ రంగాల్లో చూపిన ప్రతిభను తెలుసుకోవాలన్నారు. యువత, విద్యార్థులు వివేకానంద స్వామి చూపిన బాటలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ విభాగ కళాశాల విద్యార్థులకు 'భారతీయ సంస్కృతి - స్వామీ వివేకానంద' అన్న శీర్షికపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగ విద్యార్థులకు 'యువ సమాజానికి ఆదర్శం స్వామీ వివేకానంద' అన్న శీర్శికపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో న్యాయ నిర్ణేతలుగా విశ్వవిద్యాలయ అధ్యాపకులు డాక్టర్ శుదాంశు శేఖర పట్నాయక్, అలోక్ మహరాణ, దుర్గా మాధవ పట్నాయక్ వ్యవహరించారు. సీనియర్ వర్గ పోటీల్లో విక్రమదేవ్ విశ్వవిద్యాలయ విద్యార్థిని మానసీరాణి మహంతి ప్రథమ స్థానం, ప్రభుత్వ కళాశాల విద్యార్థిని సమర్పిత పాడీ ద్వితీయ స్థానం, విశ్వవిద్యాలయ విద్యార్థి శివప్రసాద్ మహాపాత్ర, మోడరన్ ఆంగ్ల పాఠశాల విద్యార్థిని సమర్పిత పాణిగ్రహి తృతీయ స్థానాల్లో నిలిచారు. జూనియర్ విభాగంలో మోడరన్ ఇంగ్లిష్ పాఠశాల శోభాంగీ శెట్టి ప్రథమ, శారదా విహార శిశు విద్యాలయ విద్యార్థి అనన్య పట్నాయక్ ద్వితీయ, ప్రకాశ విద్యాలయ విద్యార్థి సాయి ప్రసాద్ పాణిగ్రహి, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థి డి.సుభాషిణీరావు తృతీయ స్థానాల్లో నిలిచారు. ఈ కార్యక్రమాన్ని మీణకేతన పరిచ, సాయిబ్ మహరాణ, రాజేంద్రకుమార్ పాత్రో, సుధీర్ కుమార్ సాహు పర్యవేక్షించారు.

రాయగడ అభివృద్ధికి కృషి చేయాలి

● కొరాపుట్ ఎంపీ సప్తగిరి



రాయగడ: రైల్వే డివిజన్ ఏర్పాటులో కేంద్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం చేసిందని కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక అన్నారు. డివిజన్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన సోమవారం వీడియో సందేశాన్ని విడుదల చేశారు. 2017–18లో కేంద్ర ప్రభుత్వం రాయగడను రైల్వే డివిజన్‌గా ఏర్పాటు చేసేందుకు ప్రకటించిందన్నారు. అప్పట్లో పనులు ప్రారంభించి ఉంటే ఇప్పటికే ఈ మార్గంలో ఎన్నో కొత్త రైళ్లు నడిచేవని, అదేవిధంగా రవాణా రంగంలో ఎన్నో మెట్లు అధిగమించేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరవడంపై ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆదివాసీ, హరిజన ప్రాంతమైన ఈ జిల్లాలో మెడికల్ కళాశాల ఆవశ్యకతపై పార్లమెంటులో ఎన్నిసార్లు ప్రస్తావించినా చీమకుట్టినట్లు కూడా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. వైద్యరంగంలో చాలా వెనుకబడి ఉన్నా ఈ జిల్లాలో వందల సంఖ్యలో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉండటంతో వైద్యసేవలు పొందడంలో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ముఖ్యంగా స్పెషలిస్టులు లేక రోగులు పొరుగు రాష్ట్రాలపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అందువల్ల ఈ జిల్లాలో మెడికాల్ కళాశాలతో పాటు ఆధునిక వైద్య సౌకర్యాలు కల్పించడం ఎంతో ఆవశ్యమని వివరించారు. గుణుపూర్ -తెరువలి కొత్త రైల్వే నిర్మాణం పనుల్లో భాగంగా కొద్దిపాటి మార్పులు చేస్తే ప్రజలు మరిన్ని సౌకర్యాలు పొందవచ్చన్నారు. ఈ రైలే మార్గంలో కొండలు, గుట్టలను దొలిచే బదులు గుణుపూర్-తెరవలి మార్గంలో భాగంగా వయా పద్మపూర్, బిసంకటక్ మీదుగా నిర్మించగలిగితే బాగుండేదని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. జిల్లాల అభివృద్ధి కోసమని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఏర్పాటు చేసిన దక్షిణ వికాష్ పరిషత్ టాస్క్‌ఫోర్స్‌లో రాయగడ జిల్లా నుంచి ఒక్క సభ్యుడు లేకపోవడం విచారకరమన్నారు. సభ్యుడిగా ఎవరైనా ఉంటే ఈ ప్రాంత సమస్యలు ప్రభుత్వం దృష్టికి వెళ్లి మరింత అభివృద్ధికి నాంది పలికేవారని ఆశాభావం వ్యక్తం చేశారు.

టికిరిని సమితిగా గుర్తించాలి



సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

రాయగడ: జిల్లాలోని కాశీపూర్ సమితిలో అంతర్భాగమైన టికిరిని సమితిగా గుర్తించాలని ఆ ప్రాంత వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు టికిరిలో గల హనుమాన్ మందిరం ప్రాంగణంలో సోమవారం సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం సమితులు, తహసీల్‌లను పెంపొందించే యోచనలో ఉన్న నేపథ్యంలో టికిరి పంచాయతీని సమితిగా గుర్తించగలిగితే మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఇదివరకే ఈ విషయమై ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లామన్నారు అప్పటికి ఇటువంటి యోచన లేని ప్రభుత్వం ఈ విషయమై పట్టించుకోలేదన్నారు. మరోసారి ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేందుకు అందరూ కలిసికట్టుగా పోరాడాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో రాయగడ మాజీ ఎమ్మెల్యే మకరంద ముదులి, సమితి అధ్యక్షుడు కొంతొ మాఝి, సాధు చరణ్ మాఝి, వాణిజ్య సంఘం అధ్యక్షుడు మనోజ్ కుమార్ బెహర, తదితరులు పాల్గొన్నారు.

'పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తాం'

శ్రీకాకుళం అర్బన్: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో సత్వర చర్యలు తీసుకుంటామని పెన్షనర్ ఉద్యోగ సంఘ నాయకులకు జిల్లా ఖజానాశాఖ ఉపసంచాలకులు సి.రవికుమార్ అన్నారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా, సిటీ బ్రాంచి సంయుక్తంగా సోమవారం శ్రీకాకుళంలోని ఎన్‌జీఓ కార్యాలయంలో ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎస్ఆర్ఎస్ ప్రకాశరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్లకు అన్ని రకాలయిన సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సోమసుందరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రకాశరావులు మాట్లాడుతూ సోమవారం నుంచి శనివారం వరకూ ప్రతిరోజూ ఎన్‌జీఓ కార్యాలయంలో పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్‌లను పూర్తి చేసుకోవాలన్నారు.

పెన్షనర్‌లు ఎవరైనా కదలలేని స్థితిలో ఉన్న వారికి ఇంటికి వెళ్లి లైఫ్ సర్టిఫి కెట్లు చేస్తామని, సభ్యులు తెలియజేస్తే పూర్తిచేస్తామని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుల నిరసన



ఎమ్మెల్యే రమేష్ బిదురీ చిత్రపటాన్ని దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

పర్లాకిమిడి: ఏఐసీసీ కార్యదర్శి, ఎంపీ ప్రియాంకా గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఢిల్లీ కల్‌కాజీ విధానసభ ఎమ్మెల్యే రమేష్ బిదురీపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా పర్లాకిమిడిలోని తెలుగు సోండి వీధి వద్ద కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. డీసీసీ అధ్యక్షులు, మోహనా ఎమ్మెల్యే దాశరథి గోమాంగో ఆదేశాల మేరకు ఢిల్లీ ఎమ్మెల్యే రమేష్ బిదురీ చిత్ర పటాన్ని మహిళా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జస్మిన్ షేక్ ఆధ్వర్యంలో దహనం చేసి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బసంతపండా, మాజీ కౌన్సిలరు అభిమన్యు పండా, సురేష్ మఝి ఉన్నారు.



ప్రదర్శనలో వివిధ దేశాల నాణాలు



నాణాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న మితేశ్ రంజన్ సాహు

కేవీలో నాణాల ప్రదర్శన

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో సీఎంపీ ఆధ్వర్యంలో సోమవారం నాణాల ప్రదర్శన జరిగింది. వోఎస్ ఏపీ మల్కన్‌గిరిలో పనిచేస్తున్న మితేశ్ రంజన్ సాహు 295 దేశాలకు చెందిన ప్రాచీన నాణాలు, స్పెసిమెన్ జయంతి స్మారక నాణాలతో పాటు బ్యాంక్ టోకెన్లను సేకరించారు. వీటిని ప్రదర్శించగా విద్యార్థులు ఆసక్తిగా గమనించారు. కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ కై లాస్ మీన, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

ఆమదాలవలస: సంక్రాంతి ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సౌత్‌సెంట్రల్ రైల్వే ధ్వర్యంలో మొత్తంగా 52 రైళ్లు అదనంగా నడపనున్నట్లు ప్రకటించారు. ఇందులోభాగంగా శ్రీకాకుళంరోడ్ (ఆమదాలవలస), చర్లరల్లి, కాచిగూడల మధ్య ప్రత్యేక రైళ్లు వేసినట్లు రైల్వే అధికారులు సోమవారం వెల్లడించారు. ఈ రైళ్లను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైలు నంబర్	స్టేషన్లు	డిపార్చర్	అరైవల్	తేదీలు
07025	చెర్లపల్లి–శ్రీకాకుళంరోడ్	19.20	09.00	9,12,14
07026	శ్రీకాకుళంరోడ్- చెర్లపల్లి	14.45	06.00	10,13,15
07041	కాచీగూడ–శ్రీకాకుళంరోడ్	17.45	09.00	7
07042	శ్రీకాకుళంరోడ్- కాచీగూడ	14.45	07.30	8

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

మల్కన్‌గిరి: రోడ్డు ప్రమాదంలో విద్యార్థి గాయపడ్డాడు. ఈ సంఘటన మల్కన్‌గిరి సమితి చలాన్‌గూఢ పంచాయతీ బుద్రగూఢ గ్రామం వద్ద సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ధాన్యం లోడుతో వస్తున్న పీకాప్ వ్యాన్ సైకిల్‌పై వెళ్తున్న అనంత భూమియాను బలంగా ఢీకొని బోల్తాపడింది. దీంతో విద్యార్థి భూమియాకు తీవ్ర గాయాలయ్యాయి. స్పందించన వ్యాన్ డ్రైవర్ సంతోష్ మానిక్ గాయపడిన అనంత భూమియాను మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. భూమియా మల్కన్‌గిరి మోడ్రాన్ డిగ్రీ కాలేజ్‌లో +3 కామర్స్ చదువుతూన్నాడు. స్వగ్రామం మత్తిలి సమితి పదియారాస్ కాగా.. బుద్రగూఢలో సోదరి ఇంట్లో ఉంటూ చదువుకుంటున్నాడు. ప్రమాద సమాచారం తెలుసుకున్న చలాన్‌గూఢ సర్పంచ్ అరిక్షత్ నాయిక్ సంఘటనా స్థలాన్ని సందర్శించి సహాయక చర్యలు చేపట్టారు. అలాగే మల్కన్‌గిరి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఐఐసీ రీగాన్ కీండో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బోల్తా పడిన వ్యాన్

యువకుడు ఆత్మహత్య

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం గ్రామంలో అద్దె ఇంట్లో నివాసముంటున్న వావిలాపల్లి సురేష్(25)అనే యువకుడు సోమవారం రాత్రి అద్దెకు ఉంటున్న ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు విజయనగరం జిల్లా మడక ముడిగాం గ్రామానికి చెందినవాడు. సురేష్ మూలపేట పోర్టులో శ్రీబాలాజీ మెస్ పవర్ సప్లయ్‌లో భోజనాలు అందించే వర్కర్‌గా కొద్దికాలంగా పనిచేస్తున్నాడు. మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి రూమ్‌లో ఉంటున్నాడు. అయితే సోమవారం ముగ్గురు కలిసి డ్యూటీకి వెళ్లగా, తిరిగి సాయంత్రం సురేష్ తన రూమ్‌కి వచ్చి ఆత్మహత్య చేస్తుకున్నట్లు స్థానికులు, తోటి స్నేహితులు చెబుతున్నారు. అయితే సురేష్ మృతికి గల కారణాలు తెలియలేదు. యువకుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న సంతబొమ్మాళి ఎస్‌ఐ వై.సింహాచలం ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని శవపంచనామ నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

62 మద్యం బాటిళ్లు పట్టివేత

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి పలాస ఇందిరా చౌక్ పోలీసుల తనిఖీల్లో భాగంగా సోమవారం రాత్రి 62 మద్యం బాటిళ్లతో ఇద్దరు యువకులు అరెస్టైనట్లు కాశీబుగ్గ పోలీసు స్టేషన్ సీఐ సూర్యనారాయణ తెలిపారు. వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన కర్ని అభిలాష్, నందిగాం మండలానికి చెందిన అంబటి ఠాగూర్ ఇరువురు స్నేహితులు ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రాష్ట్రానికి చెందిన 47 మద్యం బాటిళ్లు, 15 బీర్లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశామని తెలిపారు.



పట్టుబడిన మద్యం బాటిళ్లతో పోలీసులు

జాతీయ స్థాయి పోటీలకు డొంకూరు విద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని డొంకూరు మత్స్యకార గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి అథ్లెటిక్స్, ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. గత నెలలో ఏలూరులో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-14 షాట్‌పుట్ బాలుర విభాగంలో బి.శరత్ చంద్ర 12.45 మీటర్స్‌లో రజిత పతకం పొంది, జార్ఖండ్ రాష్ట్రం రాంచీ వేదికగా ఈనెల 11 నుంచి 15 వరకు జరగబోయే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా తరుపున పాల్గొంటున్నాడు. అదేవిధంగా పల్నాడు జిల్లా వేదికగా అండర్-14 బాలికల ఖోఖో రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీలో జిల్లా తరుపున అసమాన ప్రతిభను కనబర్చి రజిత పతకం పొందిన డి.మీనా, మహారాష్ట్ర కొల్హాంపూర్ వేదికగా ఈనెల 10 నుంచి 14 వరకు జరగబోయే జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు జి.సరోజిని తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు బి.శరత్‌చంద్ర, డి.మీనాలను సోమవారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, స్కూల్ పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు. వ్యాయామోపాధ్యాయులు వజీర్ అహ్మద్‌ను అభినందించారు.

రోడ్డున పడేశారు

● ఆక్రమణల తొలగింపు
● లబోదిబోమన్న నిర్మాణదారులు
● 40 ఏళ్లుగా అక్కడే నివసిస్తున్నామని వేడుకోలు



జేసీబీతో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

ఆమదాలవలస: మండలంలోని చిన్నజొన్నవలస గ్రామంలో సర్వే నంబర్ 108లో ఒకటి, రెండు నంబర్లతోపాటు సర్వే నంబర్ 14లోని మోదుగుల చెరువు గట్టు, ఆర్‌అండ్‌బీ రహదారికి ఆనుకొని ఉన్న అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు సోమవారం తొలగించారు. ఇక్కడ సుమారు 25 సెంట్ల స్థలంలో 21 మంది ఇళ్లు, పశువుల శాలలు, దుకాణాలు నిర్మించుకున్నారు. గతంలో చెరువు ఆక్రమణకు గురవుతోందని అదే గ్రామానికి చెందిన రెడ్డి తవుడు, గుండ రాజులు కలెక్టర్ గ్రీవెన్స్, కోర్టును ఆశ్రయించారు. అయితే ఆ కేసుకు సంబంధించి 2023 ఆగస్టులో ఆక్రమణలు తొలగించాలని అప్పటి రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయితేవారు ఈ విషయంలో జాప్యం చేయడంతో ఫిర్యాదుదారులు హైకోర్టును ఆశ్రయించి అప్పటి జిల్లా కలెక్టర్లు శ్రీకేష్ బి.లాఠకర్, జిలాని, ముగ్గురు ఆర్డీవోలు, నలుగురు తహసీల్దార్లపై ఉన్నత న్యాయస్థానంలో కోర్టు ధిక్కారణ కింద కేసు వేశారు. ఈ కేసుకు సంబంధించి కోర్టు ఆదేశాల మేరకు జనవరి 20వ తేదీలోపు ఆక్రమణలు తొలగించకపోతే సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు చేపడతామని నోటీసులు రావడంతో, రెవెన్యూ అధికారులు ఆక్రమణలు తొలగించడానికి రంగం సిద్ధం చేశారు.

ఆక్రమణదారులకు నోటీసులు



రోడ్డుపై నిరసన తెలుపుతున్న బాధితులు

ఆక్రమణలు తొలగించాలనే ఆదేశాలతో తహసీల్దార్ ఎస్.రాంబాబు 20 రోజుల క్రితం ఆక్రమణదారులకు నోటీసులు అందజేశారు. ఈ నేపథ్యంలోనే తహసీల్దార్ ఆధ్వర్యంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ బాలరాజు, ఎంపీడీవో వెంకట్రావు తదితర అధికారులంతా సోమవారం అక్కడికి చేరుకొని ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. అక్రమ నిర్మాణదారులకు అన్ని శాఖల అధికారులు కలిసి సమన్వయంతో వారిని వారించి, వేరొక చోట ఇళ్ల పట్టాలను అందిస్తామని చెప్పి తొలగింపులు చేపట్టారు. ఆక్రమణలు తొలగిస్తున్న సమయంలో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తూ ఇళ్లను కూల్చివేస్తే తాము ఎక్కడ నివసించేదని లబోదిబోమంటూ కన్నీరు పెట్టుకున్నారు. రహదారికి అడ్డంగా కూర్చొని నిరసన చేశారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులతో గత 40 సంవత్సరాలుగా ఆ ప్రాంతంలో నివాసముంటూ జీవనం సాగిస్తున్నామని, గతంలో ఉండే ప్రభుత్వాలు తమకు కుళాయిలు, విద్యుత్ సౌకర్యాలు కల్పించారని పేర్కొన్నారు. ఇప్పుడు ఒక్కసారి తమ బతుకులను రోడ్డుపై పడేయడం తగదని గగ్గోలు పెట్టారు. ఆ గ్రామ సర్పంచ్ గొంటి అనిల్‌కుమార్ అక్కడికి చేరుకొని అధికారులు కొన్ని రోజులు గడువు ఇవ్వాలని కోరారు. దీనికి అధికారులు ఒప్పుకోకపోవడంతో వెనుదిరిగారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ గణపతి, మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోపి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పప్పల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

చిన్నజొన్నవలస గ్రామంలో ఆక్రమణలు తొలగించడంతో 21 కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. దీంతో వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్‌తోపాటు పలువురు నాయకులు వెళ్లి జరిగిన విషయంపై తహసీల్దారు, సీఐలను అడిగి తెలుసుకున్నారు. వారికి కొంత సమయం ఇవ్వాలని కోరారు. అది కుదరదని అధికారులు తేల్చి చెప్పడంతో వారంతా నిరాశ్రయులు అయ్యారని, వారికి వెంటనే ఇళ్లస్థలాల పట్టాలు మంజూరు చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే వారికి ఇల్లు నిర్మించుకునేందుకు వెంటనే నిధులు మంజూరు చేయాలన్నారు. ఈ నేపథ్యంలోనే వారందరికీ ఆ గ్రామంలో చింతాడ రవికుమార్ టెంట్లు వేయించి, భోజనాలకు ఏర్పాటు చేసి రాత్రి వేళలో అక్కడ ఉండేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొంటి కృష్ణ, ఈశ్వరరావు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులు, బాధితులతో మాట్లాడుతున్న రవికుమార్

క్లుప్తంగా

రామతీర్థం గిరిప్రదక్షిణను జయప్రదం చేయండి



గిరిప్రదక్షిణ రహదారిని పరిశీలిస్తున్న శ్రీనివాసనంద సరస్వతి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఈ నెల 10న నిర్వహించే గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసనంద సరస్వతి పిలుపునిచ్చారు. గిరి ప్రదక్షిణ జరిగే ప్రాంతంలో కొండచుట్టూ జరుగుతున్న రహదారి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరి ప్రదక్షిణ రహదారిని ప్రభుత్వం అభివృద్ధి చేయడం శుభ పరిణామమన్నారు. వైకుంఠ ఏకాదశి రోజున గిరి ప్రదక్షిణ చేయడం ముక్తి దాయకమని ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థాన అధికారులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రామతీర్థం సేవా పరిషత్ అధ్యక్షుడు జ్యోతి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన వ్యక్తుల అరెస్టు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రాంబాబు

పాలకొండ: గతేడాది పదవ నెలలో పాలకొండ అసిస్టెంట్ సూపరింటెండెంట్ పోస్టల్ (ఏఎస్పీ)పై దాడిచేసిన వ్యక్తులను అరెస్టు చేశామని డీఎస్పీ ఎం. రాంబాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఏఎస్పీ తనకు సెలవులు ఇవ్వడం లేదని నవగాం గ్రామానికి చెందిన బీపీఎంగా పనిచేస్తున్న కందివలస దుర్గాప్రసాద్ ఏఎస్పీపై కక్షపెంచుకున్నాడు. నేరుగా తాను దాడిచేస్తే ఉద్యోగం పోతుందన్న భయంతో కిరాయి వ్యక్తులతో మాట్లాడుకున్నాడు. విజయనగరానికి చెందిన షేక్ సాజన్, అంబటి ప్రకాష్, పుర్లి రాజులను ఇందుకు పురమాయించి ఏఎస్పీ నివాసం ఉన్న ఇంటిని చూపించాడు. వారు వారం రోజుల పాటు రెక్కీ నిర్వహించి గత ఏడాది పదోనెల 8వ తేదీన ఏఎస్పీ ఇంటి మీదకు వెళ్లి దాడి చేసి చిదకబాదారు. దీనిపై ఏఎస్పీ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులుగా నమోదైన కేసులో ఏబీపీఎం దుర్గాప్రసాద్ దీనంతటికీ కీలంగా గుర్తించి ఆయనను అదుపులోకి తీసుకుని ఆయన ద్వారా దాడిచేసిన ముగ్గురిని అరెస్టు చేశామని డీఎస్పీ వివరించారు.

అంతర్ వర్సిటీ వాలీబాల్ పోటీలకు జీఎంఆర్ ఐటీ విద్యార్థినులు



పి.శ్రావణి



జె.హర్షిత



వి.ధాత్రి



వి.సాయిసుచరిత్ర

రాజాం సిటీ: ఈ నెల 8 నుంచి 13 వరకు చెన్నైలోని జెప్పిరార్ యూనివర్సిటీలో జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలకు జీఎంఆర్ ఐటీ విద్యార్థినులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ సోమవారం తెలిపారు. ఈ ఎంపికలు ఇటీవల జేఎన్‌టీయూ జీవీలో జరిగాయన్నారు. కళాశాలకు చెందిన పి.శ్రావణి, జె.హర్షిత, వి.ధాత్రి, వి.సాయిసుచరిత్రలు ప్రతిభకనబరిచి జేఎన్‌టీయూ జీవీ జట్టు తరఫున ఎంపికయ్యారని పేర్కొన్నారు. వారి ఎంపికపట్ల ప్రిన్సిపాల్‌తో పాటు ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, స్టూడెంట్ డీన్ డాక్టర్ వి.రాంబాబు, పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు జూనియర్స్ జిల్లా టెన్నికాయిట్ జట్ల ఎంపికలు

విజయనగరం:రాష్ట్రస్థాయిలో జరగనున్న జూనియర్స్ బాల, బాలికల టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 7వ తేదీన నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధి సత్యనారాయణ సోమవారం తెలిపారు. ఉదయం 9గంటల నుంచి పూసపాటిరేగ మండలం కొప్పెర్లలో జరిగే ఎంపిక పోటీల్లో 2006వ సంవత్సరం ఏప్రిల్ 1వ తేదీ అనంతరం జన్మించిన క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జిల్లా జట్టులోకి అర్హత సాధిస్తారన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 11 నుంచి 12వ తేదీ వరకు పలాసలో జరగనున్న అంతర్ జిల్లాల బాల, బాలికల జూనియర్స్ టెన్నికాయిట్ పోటీల్లో విజయనగరం జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 94917 61126 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఊరికి దూరంగా యువత

ఆ ఊరిలో యువత ఎవరూ కనిపించరు. బతుకు దెరువు నిమిత్తం వేరే ప్రాంతాలకు వెళ్లిపోయి వ్యాపారాలు చేస్తుంటారు. ఎన్నోఏళ్లుగా తమ తాతతండ్రుల నుంచి వచ్చిన వ్యాపారాన్ని చేసుకునేందుకే వీరంతా వలసబాట పడుతున్నారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా వందల సంవత్సరాల నుంచి ఈ పద్ధతి గ్రామంలో కొనసాగడం విశేషం. ఏడాదికి ఒక సారి మాత్రం సంక్రాంతి పండగ సమయంలో గ్రామానికి వచ్చి నెలరోజుల పాటు ఉంటారు. పండగ అయిపోయిన తరువాత యథాప్రకారం మళ్లీ వ్యాపారాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతుంటారు. అయితే గ్రామంలో మాత్రం వృద్ధులు, మహిళలు, బాలింతలు, చిన్నపిల్లలు కనిపిస్తుంటారు.



దోసరి గ్రామం



రచ్చబండ వద్ద అష్టాచెమ్మా ఆడుకుంటున్న గ్రామంలోని వృద్ధులు

- వ్యాపారం నిమిత్తం బయట ప్రాంతాల్లోనే అధికం
- సంక్రాంతి నెలరోజులు మాత్రమే ఊరిలో
- వృద్ధులు, మహిళలు, పిల్లలే ఇంటి వద్ద దర్శనం
- ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న వారసత్వ వ్యాపారం
- గ్రామంలో వ్యవసాయ పనులు లేకనో, పూటగడవకనో కాదు.

రాజాం: రాజాం మండలకేంద్రానికి ఏడు కిలోమీటర్ల దూరంలో దోసరి గ్రామం ఉంది. మండలంలోని శివారు గ్రామం ఇదే. ఈ గ్రామంలో ఏడు వందల గడప ఉంటుంది. ప్రతి గడపలో వృద్ధులు, చదువుకుంటున్న చిన్నారులే దర్శనమిస్తారు. 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న యువత అంతా ఇతర ప్రాంతాల్లో ఉంటారు.

దుప్పట్ల వ్యాపారంలో దిట్ట

రాజాం మండలం దోసరి గ్రామం అనగానే దుప్పట్ల వ్యాపారం గుర్తుకొస్తుంది. ఇటు ఆంధ్రప్రదేశ్‌తో పాటు అటు తెలంగాణ, మరో వైపు ఒడిశా తదితర ప్రాంతాల్లో ఈ గ్రామాల్లోని యువత ఉంటుంది. పలు జిన్నింగ్ మిల్లుల నుంచి దుప్పట్లు, మంచం పట్టీలు, డోర్ కర్టెన్స్, బెడ్ షీట్లు వంటివి వీరు నేరుగా కొనుగోలు చేస్తారు. ఈ సామగ్రిని ఆయా ప్రాంతాల్లో ప్రతిరోజూ స్కూటీలపై పెట్టి తీసుకువెళ్లి విక్రయిస్తుంటారు. ఈ గ్రామంలోని యువత ప్రతి ఒక్కరూ ఎక్కువగా ఈ వ్యాపారంపైనే దృష్టిపెడుతున్నారు. గ్రామంలో ఒకటి నుంచి పదోతరగతి వరకూ ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. పదోతరగతి పూర్తయిన తరువాత ఇంటర్మీడియట్ వరకూ రాజాంలో విద్యను కొంతమంది అభ్యసిస్తుంటారు. మరికొంత మంది వ్యవసాయ పనుల్లో ఉంటారు. 20 ఏళ్లు నిండగానే తమ ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసేస్తారు. 20 ఏళ్లు నిండిన మగపిల్లలు అంతా తొలుత తమ బంధువుల వద్ద వ్యాపార మెలవలు నేర్చుకుంటారు. అనంతరం సొంతంగా వ్యాపారాలు చేసుకుంటారు. పెళ్లైన కొత్త జంట ఏడాదికాలంపాటు ఊరిలో ఉంటుంది. తరువాత వ్యాపారం నిమిత్తం ఇతర ప్రాంతాలకు వలస కడుతుంటారు. గర్భిణులు, బాలింతలు, 5 సంవత్సరాల లోపు ఉన్న చిన్నారుల తల్లులు, వృద్ధులు, గ్రామంలో ఉంటారు. మిగిలినవారంతా వ్యాపారాల్లో నిమగ్నమవుతారు.

11 నెలలు బయటనే

సంక్రాంతి వచ్చిందంటే చాలు గ్రామంలో సందడి నెలకొంటుంది. ఎక్కడో దూర ప్రాంతాల్లో ఉన్న వ్యాపారులు అంతా గ్రామానికి చేరుకుంటారు. తమ తల్లిదండ్రులు, పిల్లలతో హాయిగా గడుపుతారు. నెలరోజుల పాటు గ్రామంలోనే ఉంటారు. అనంతరం మళ్లీ వలసబాట పడతారు. 11 నెలల పాటు వీరంతా వ్యాపారాలు చేస్తుంటారు. ప్రతి ఒక్కరూ తమ ఖర్చులు పోనూ కనీసం రూ.1 లక్షకు దాటి ఆదాయాన్ని పండగ సమయంలో తమ ఇంటికి తీసుకొస్తుంటారని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరికీ సొంత పొలాలు ఉన్నాయి. ఈ పొలాల్లో వ్యవసాయం ఎక్కువగా వృద్ధులు, మహిళలే చేస్తుంటారు. వ్యవసాయం ద్వారా వచ్చే ఆదాయం కంటే బయట దుప్పట్లు, బెడ్‌షీట్ల అమ్మకం ద్వారా వచ్చే ఆదాయం తమకు ఎంతో ఎక్కువగా ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. మరో వైపు తమ తల్లిదండ్రుల నుంచి వచ్చిన వ్యాపారం కావడంతో సరదాగా చేస్తుంటామని చెప్పుకొచ్చారు. ఉద్యోగం కంటే కూడా వీరు వ్యాపారానికే అధిక ప్రాధాన్యం ఇవ్వడం కొసమెరుపు.

మాపిల్లలు బయటే ఉన్నారు



మా పిల్లలు తెలంగాణ రాష్ట్రంలో ఉన్నారు. అక్కడ దుప్పట్ల వ్యాపారం చేస్తున్నారు. ఖర్చులు పోను ఎంతో కొంత ఇంటికి తీసుకొస్తారు. నేను వయస్సులో ఉన్నప్పుడు ఇలానే వ్యాపారం చేసేవాడ్ని. కోవిడ్ సమయంలోమాత్రమే మా వ్యాపారం ఆగింది. గ్రామంలో ప్రతి ఇంట్లో ఉన్న యువత వ్యాపారంలో ఉంటారు. పొలాలు ఉన్నా అక్కడి నుంచి వచ్చే ఆదాయం కంటే ఇక్కడ ఆదాయం తక్కువ. మా కుమారుడు మంగరాజు అప్పలనాయుడు తన 20వ ఏట నుంచే వ్యాపారం చేస్తున్నాడు.

మంగరాజు నరసయ్య, దోసరి

వ్యాపారం అంటే ఇష్టం



నాకు కుమార్తెలు ఉన్నారు. వారందరికీ పెళ్లిల్లు అయ్యాయి. ఊర్లో ఒకరికి ఇచ్చాను. నా కుమార్తె తో పాటు అల్లుడు బయటే ఉంటున్నారు. వ్యాపారాలు చేసుకుని బాగా తెచ్చుకుంటున్నారు. నా మనవళ్లు మాత్రం ఇక్కడ ఉండి చదువుకుంటున్నారు. పెద్దయితే వ్యాపారాలే ప్రధానంగా అందరూ భావిస్తుంటాం. ఎటువంటి ఇబ్బందులు లేని వ్యాపారాలు మావి. నేను కూడా దుప్పట్ల వ్యాపారం చేసేవాడ్ని. సంక్రాంతి సమయంలో మాత్రం నెలరోజులు ఇక్కడే ఉంటారు. వ్యవసాయం ఉంటే మేం చూసుకుంటాం.

గొర్లె అప్పలనాయుడు, దోసరి

సందడిగా గురుకులం క్రీడల ముగింపు

- ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన అన్నవరం విద్యార్థులు



విజేతలతో గురుకులాల సిబ్బంది

నెల్లిమర్ల: ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలల జోన్-1 క్రీడాపోటీలు నెల్లిమర్లలోని ఎంజేపీ ఏపి బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం ముగిశాయి. రెండ్రోజుల పాటు కొనసాగిన పోటీల్లో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన 14 పాఠశాలల నుంచి వందల సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో అన్నవరం గురుకుల పాఠశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్ షిప్ కైవశం చేసుకున్నారు. విజేతలకు కన్వీనర్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేబీబీ రావు బహుమతులు ప్రదానం చేశారు. రసవత్తరంగా సాగిన ఈ పోటీల్లో వ్యక్తిగత విభాగంలో కె.భారతి చాంపియన్ షిప్ సాధించింది. కబడ్డీ పోటీల్లో టెక్కలి గురుకులం జట్టు ప్రథమస్థానంలో నిలవగా సాలూరు జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. ఖోఖోలో పలాస, ఆమదాలవలస మొదటి రెండు స్థానాలలో నిలిచాయి. బ్యాడ్మింటన్‌లో తానాం, పార్వతీపురం ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించాయి. హ్యాండ్‌బాల్‌లో తానాం, నెల్లిమర్ల జట్లు వరుస స్థానాలలో నిలిచాయి. ఈ పోటీలను పీఈటీలు కామేశ్వరి, సూర్యారావు, మోహన్, ఆనంద్, సీత, దమయంతి పర్యవేక్షించారు.

యువకుడి హత్య

- స్నేహితుడే హంతకుడు



సంఘటనా స్థలంలో విచారిస్తున్న సీఐ రామకృష్ణ, ఎస్సై ఐ.దుర్గాప్రసాద్



మృతి చెందిన పవన్‌కుమార్

పూసపాటిరేగ: మండలంలోని ఎరుకొండ గ్రామంలో ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. ఇద్దరు స్నేహితుల మధ్య డబ్బులు విషయమై జరిగిన వాగ్వాదమే హత్యకు దారితీసింది. ఈ ఘటనపై పోలీసులు, స్థానికులు తెలిపిన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎరుకొండ గ్రామానికి చెందిన గొర్లె పవన్‌కుమార్ (21), బొంతు అప్పలనాయుడు మంచి స్నేహితులు. ఇద్దరూ పెయింటింగ్ పనులు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 10.30గంటల సమయంలో ఇద్దరు స్నేహితుల మధ్య డబ్బుల విషయమై వివాదం చెలరేగింది. పవన్‌కుమార్‌కు అప్పలనాయుడు డబ్బులు ఇవ్వాల్సి ఉండడంతో ఇద్దరి మధ్య గొర్లె పవన్‌కుమార్ ఇంటి ఎదురుగా రహదారిపై వాగ్వాదం జరిగింది. ఆ క్రమంలో బొంతు అప్పలనాయుడు మద్యం మత్తులో స్నేహితుడు గొర్లె పవన్‌కుమార్‌పై కత్తితో పలుమార్లు విచక్షణారహితంగా ఛాతీ, కడుపులో పొడవడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. కేకలు వినబడడంతో ఉలిక్కి పడిన పవన్‌కుమార్ తల్లి గొర్లె బంగారమ్మ ఇంటి బయటకు వచ్చి చూడగా రక్తపు మడుగులో ఉన్న కుమారుడి చేతిని తన చేతిలోకి తీసుకుని సొమ్మసిల్లి పడిపోయింది. తల్లి చేతిలో ఉండగానే పవన్‌కుమార్ సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఈ సంఘటనపై సమాచారం అందుకున్న భోగాపురం రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై ఐ. దుర్గాప్రసాద్ లు సంఘటనా స్థలానికి సిబ్బందితో పాటు చేరుకుని విచారణ చేశారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు భోగాపురం రూరల్ సీఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబానికి పెద్ద దిక్కు పోయింది

గొర్లె పవన్‌కుమార్ మృతి చెందడంతో కుటుంబం దిక్కులేనిదైంది. గతంలోనే పవనకుమార్ తండ్రి తాడు అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న వవన్‌కుమార్ కూలిపనులు చేయడంతో కుటుంబం గడిచేది. పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండేవాడని, ఒక్కగానొక్క కుమారుడిని తీసుకెళ్లిపోయావా అంటూ తల్లి, బంధువులు భోరున విలపించారు.

8,400లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



సారా తయారీ కేంద్రాలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

పార్వతీపురంటౌన్: ఆంధ్రా, ఒడిశా సరిహద్దు గ్రామాలైన అలమండ, కర్లి గ్రామాల్లో ఆంధ్రా, ఒడిశా ఎక్సైజ్ సిబ్బంది సోమవారం దాడులు నిర్వహించినట్లు ఏఈఎస్ దొర తెలిపారు. ఈ సందర్భంగా పార్వతీపురం ఎక్సైజ్ కార్యాలయం వద్ద విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఒడిశా సరిహద్దు గ్రామాల్లో సారా తయారవుతోందన్న ముందస్తు సమాచారంతో ఒడిశా ఎక్సైజ్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో 8,400లీటర్ల పులిసిన బెల్లపు ఊటలను ధ్వంసం చేశామని చెప్పారు. రవాణాకు సిద్ధంగా ఉన్న 80లీటర్ల సారాను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సారా తయారీకి సంబంధించి మూడు కేసులు నమోదు చేసి ఒడిశా ఎక్సైజ్ అధికారులకు అప్పగించామన్నారు. సరిహద్దు గ్రామాల్లో సారా తయారీపై నిఘా పెట్టి ఎప్పటికప్పుడు దాడులు నిర్వహిస్తామని, ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి సారా రవాణా జరగకుండా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సీఐలు సురేష్, బీఎస్ఎన్ మూర్తి, షేఖరుబాబు, సింహాద్రి, బి. పద్మావతి, ఎస్సైలు యు. నాగేశ్వరరావు, నరేంద్ర, శ్రావణ్‌కుమార్, రాజశేఖర్, ఎస్‌వీ రామారావు, బాబూరావు, ఒడిశా ఎక్సైజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రీ ఓపెన్ వినతుల పట్ల కలెక్టర్ ఆగ్రహం

- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో 163 వినతుల స్వీకరణ



వినతులు స్వీరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం అర్బన్: వినతులు రీ ఓపెన్ అయిన సంబంధిత శాఖల అధికారులపై కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమ్యల పరిష్కార వేదికలో ఆయనతో పాటు డీఆర్ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్లు సుధారాణి, మురళి తదితరులు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 163 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో వినతుల పరిష్కారంపై కలెక్టర్ సమీక్షించారు. సంతృప్తికర రీతిలో పరిష్కరించక మళ్లీ రీ ఓపెన్ అవుతున్నాయని సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చూడకుండా ఉన్న వినతులు కూడా ఉన్నాయని, అధికారులు వినతులు వెంటనే చూడని ఎడల చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. సీఎంఓకు పంపే మినిట్స్‌లో వారి పేర్లను నమోదు చేస్తామని తెలిపారు. ఆర్థికేతర వినతులన్నింటికీ తగు పరిష్కారం చూపాలని ఫార్వర్డ్ చేయవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు 17 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: ప్రజల సమస్యల తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ వకుల్ జిందల్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆయన గ్రీవెన్స్ సెల్ నిర్వహించి ప్రజల నుంచి 17 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ సీఐ ఎస్.శంకరరావు, ఎస్పీ సీఐ ఎ.లీలారావు, ఎస్సై రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



వినతులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



బధిరులకు టచ్ ఫోన్‌లను అందజేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్ఓ కె.హేమలత, కేఆర్ఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి భాగస్వాములై అర్జీదారుల నుంచి 121 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పనిచేసి, త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇవ్వాలని, అర్జీలను ఆడిటింగ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్జీల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కార ప్రగతిపై ప్రతివారం సమీక్షించనున్నట్లు చెబుతూ అర్జీలు రీ ఓపెన్ కాకుండా సరైన కారణాలను అర్జీదారుకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుపతి నాయుడు, వైద్య ఆరోగ్య శాఖ నోడల్ అధికారి డా. ఎం.వినోద్ కుమార్, ప్రోగ్రాం అధికారి డా. టి. జగన్‌మోహన్‌రావు, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డా.ఎస్. మన్మథరావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి. శ్రీనివాసరావు, డ్వామా, డీఆర్‌డీఏ పథక సంచాలకులు కె.రామ చంద్రరావు, వై.సత్యంనాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల కిట్లు అందజేత

కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో సోమవారం భూసార పరీక్షల కిట్లను మండల వ్యవసాయాధికారులకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముందస్తు ప్రణాళికతో జిల్లాలో భూసార పరీక్షలను నిర్వహించి, రైతులకు వివరించాలని చెప్పారు. పంట దిగుబడులను పెంచేందుకు, వ్యవసాయ మదుపులను తగ్గించేందుకు భూసార పరీక్షలు ఎంతో దోహదం చేస్తాయన్నారు.

టచ్‌ఫోన్‌ల పంపిణీ

కలెక్టరేట్‌లో సోమవారం ఇద్దరకు బధిరులకు టచ్‌ఫోన్లను కలెక్టరేట్‌లో అందజేశారు. టచ్ ఫోన్‌ల కోసం అర్జీ అందజేసిన డి.రవీంద్ర, బి.పారయ్యలు వాటిని కలెక్టర్ చేతులమీదుగా అందుకున్నారు.

జాతీయ జూనియర్స్ కబడ్డీ పోటీలకు జిల్లా క్రీడాకారులు

- ఈ నెల 8 నుంచి ఉత్తరాఖండ్‌లో జరగనున్న పోటీలు



ఎం.రాంబాబు



సీహెచ్ మురళి



ఎం.పావని



పి.నందిని



వి.సూర్యకళ

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారులు అర్హత సాధించారు. ఇటీవల రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు క్రీడాకారులు 50వ జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. క్రీడాకారులు ఎం.రాంబాబు, సీహెచ్.మురళి, పి.నందిని, వి.సూర్యకళ, ఎం.పావని లు ఆంధ్రప్రదేశ్ జట్టులో స్థానం దక్కించుకున్న వారిలో ఉన్నారు. క్రీడాకారులు ఈనెల 8 నుంచి 13వ తేదీ వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరగనున్న అంతర్ రాష్ట్ర జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఛైర్మన్ ఐవీపీ రాజు, అధ్యక్షుడు రంగారావుదొర, ప్రధాన కార్యదర్శి కేవీ ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన.లక్ష్మణరావు, కోశాధికారి బి.శివప్రసాద్‌లు అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభపాటవాలు కనబరిచి విజయనగరం జిల్లా కీర్తి ప్రతిష్ఠలు చాటి చెప్పాలని ఆకాంక్షించారు.

ప్రకృతి సాగు లాభదాయకం..

- వెలుగు ఏపీఎం శ్రీనివాస్



కూరగాయల స్టాల్ వద్ద వెలుగు అధికారులు, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు, కొనుగోలుదారులు

డెంకాడ: ప్రకృతి సాగు విధానంలో పంటలు పండించడం ఎంతో లాభదాయకమని, దిగుబడులు కూడా ఆరోగ్యకరంగా ఉంటాయని వెలుగు ఏపీఎం శ్రీనివాస్ అన్నారు. మండలంలోని డెంకాడ, అమకాం గ్రామాల్లో ప్రకృతి సాగులో పండించిన కూరగాయల స్టాల్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఓం శ్రీనివాస్, ఎఫ్‌పీజీ ఏపీఎం గురుమూర్తి మాట్లాడుతూ.. రసాయన ఎరువులు, పురుగు మందులను వినియోగించి పంటలు సాగు చేయడం వల్ల పంటలు కలుషితమవుతాయన్నారు. సేంద్రియ ఎరువులు వినియోగించడం వల్ల ఆరోగ్యకరమైన దిగుబడులు వస్తాయని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు ప్రతి సోమవారం వెలుగు కార్యాలయం వద్ద దిగుబడులు విక్రయిస్తారని, ఈ స్టాల్లను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో జిల్లాకు పతకాలు









రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు సత్తా చాటారు. ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా తణుకులో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురు క్రీడాకారులు పతకాలు సాధించారు. పురుషుల 10 కిలోమీటర్ల పరుగు పోటీలో యోగేష్‌కుమార్ రజత పతకం సాధించగా, అండర్-20 8 కిలోమీటర్ల విభాగంలో ఎం.హరీష్ బంగారు పతకం, అండర్-18 విభాగంలో 6 కిలోమీటర్ల పరుగు పోటీలో పి.సురేష్ కాంస్య పతకం, బి.సాయి రజత పతకాలను కైవసం చేసుకున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం అభినందించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

నెల్లిమర్ల: భోగి, సంక్రాంతి పండగల నేపథ్యంలో మండల పరిధిలో ఎక్కడైనా కోడి పందాలు, పేకాట శిబిరాలు నిర్వహించినా చర్యలు తప్పవని ఎస్సై బి. గణేష్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో పేకాట, కోడి పందాల్లో అరెస్టయిన వ్యక్తులను మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేసినట్లు తెలిపారు.